# ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల్లో సాధారణ దంత సమస్యలు & నిర్వహణ విధానాలు

పిల్లల దంత వైద్య నిపుణులు
**డా. గాయత్రి మోఘే, డా. కెవిన్ వెర్గీస్ సామ్** ల సహకారంతో

# దంత క్షయం (పిప్పి పళ్ళు)

**ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల్లో పళ్లు పాడవకుండా ఉండేందుకు ఎక్కువ జాగ్రత్త అవసరం. ఇందుకు కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి:**

- **ఆహారపు అలవాట్లు** – సరిగా నమలలేకపోవడం వల్ల ఆహారం నోటిలో మిగిలిపోవచ్చు.
- **నోరు ఎండిపోవడం** – లాలాజలం తక్కువగా ఊరడం వల్ల నోరు ఎండిపోతుంది.
- **నోటి పరిశుభ్రతను నిర్వహించడంలో ఇబ్బందులు** – నాలుక కదలికలు సరిగా లేకపోవడం వల్ల నోటిలోని అన్ని భాగాలను పూర్తిగా శుభ్రం చేయడం కష్టమవుతుంది.
- **గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి (GERD)** – కడుపులోని ఆమ్లం ఆహారనాళంలోకి తిరిగి వచ్చి, కొన్నిసార్లు నోటిలోకి చేరుతుంది. దీనివల్ల పళ్లపై ప్రభావం పడవచ్చు.
- **వికార భావం** – టూత్‌బ్రష్, పేస్ట్ లేదా లాలాజలం వల్ల వాంతి వచ్చే భావన కారణంగా పిల్లలు పూర్తిగా బ్రష్ చేయలేకపోవచ్చు.
- **చిగుళ్ల కణజాలం పెరగడం** – కొంతమందిలో చిగుళ్ల కణజాలం ఎక్కువగా పెరుగుతుంది.
- **పళ్లు దగ్గరగా ఉండడం** – పళ్లు దగ్గర దగ్గరగా ఉండటం వల్ల శుభ్రం చేయడం కష్టం అవుతుంది.
- **నోటి కదలికలు మరియు స్పర్శకు సంబంధించిన సమస్యలు** – ముఖ్యంగా ASD (ఆటిజం) ఉన్న పిల్లలు నొప్పిని ఎక్కువగా భరించగలగడం వల్ల అసౌకర్యాన్ని చెప్పకపోవచ్చు.
- **కొన్ని ప్రత్యేక ఆహారాలపై ఆసక్తి మరియు ఆహార అలర్జీలు**

# పళ్ళు రావడం

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల్లో పళ్ళు ఆలస్యంగా రావచ్చు.



పళ్ల అభివృద్ధిలో **ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు ఉన్న పిల్లల్లో పళ్లు చాలా త్వరగా కానీ, ఆలస్యంగా కానీ, మధ్యలో ఆగిపోవడం లేదా అసమానంగా రావడం** కనిపించవచ్చు.

ప్రత్యేకంగా డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లలు మరియు హైపోథైరాయిడిజం ఉన్న పిల్లల్లో పళ్ళు ఆలస్యంగా రావడం ఎక్కువగా కనిపిస్తుంది.

# పళ్లలో అసమాన అమరిక & దంత లోపాలు

- మాలోక్లూజన్ (పై పళ్లు మరియు కింది పళ్లు సరిగా కలవకపోవడం) మరియు పళ్లు దగ్గర దగ్గరగా ఉండటం వల్ల నోటి పరిశుభ్రతను పాటించడం కష్టమవుతుంది. ఎందుకంటే అటువంటి పళ్ల మధ్య ఖాళీల వలన సరిగా శుభ్రం చేయడం కష్టం.

- అభివృద్ధి సంబంధిత సవాళ్లు, ముఖం మరియు దవడ ఎముకల నిర్మాణ లోపాలు, కండరాల బలహీనత మరియు మేధో సంబంధిత లోపాలున్న పిల్లల్లో ఈ దంత సమస్యలు కనిపించవచ్చు.

- పళ్లలో అసాధారణతలు: పళ్లు సరిగ్గా ఏర్పడకపోవడం, కొన్ని పళ్లు లేకపోవడం లేదా అదనపు పళ్లు ఉండటం వంటివి కనిపించవచ్చు. ఇవి పళ్ల రూపాన్ని ప్రభావితం చేయడమే కాకుండా, పళ్లు పాడయ్యే అవకాశాన్ని కూడా పెంచుతాయి.

- కొన్ని ప్రత్యేక రుచులు మరియు కొన్ని రకాల ఆహారాల పట్ల ఇష్టం కారణంగా నోరు సహజంగా శుభ్రం కావడం  తగ్గుతుంది.



# చిగుళ్ల అసాధారణ పెరుగుదల (జింజివల్ హైపర్‌ప్లాసియా)

చిగుళ్లు అసాధారణంగా పెరగడాన్ని జింజివల్ హైపర్‌ప్లాసియా అంటారు. ఇది సాధారణంగా ఫిట్స్ (మూర్ఛ) కోసం మూర్ఛ నివారణ మందులు తీసుకునే పిల్లల్లో కనిపిస్తుంది, ముఖ్యంగా ఫెనిటోయిన్ మరియు సోడియం వాల్‌ప్రోయేట్ వాడే పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది.

ఇది పళ్ల మరియు చిగుళ్ల రూపంలో మార్పులు కలిగించడమే కాకుండా, పిల్లల్లో ఈ సమస్యలకు కూడా కారణమవుతుంది:

- నోటి పరిశుభ్రతను సరిగా పాటించలేకపోవడం
- పళ్ల రావడంలో ఇబ్బందులు
- ఆహారం నమలడంలో కష్టం
- చిగుళ్లలో తీవ్రమైన వాపు
- చిన్న వయస్సులోనే చిగుళ్ల వ్యాధులు రావడం
- పళ్లకు మద్దతు ఇచ్చే ఎముక బలహీనపడడం



# గాయాలు



ప్రత్యేక అవసరాలున్న పిల్లల్లో ముఖం మరియు నోటికి గాయాలు ఈ కారణాల వలన కలగవచ్చు.

- సీజర్స్ (మూర్ఛ)
- లేదా శరీర రక్షణ ప్రతిస్పందనలు (ప్రొటెక్టీవ్ రిఫ్లెక్సెస్) సరిగా పనిచేయకపోవడం

కొంతమంది పిల్లలు తమను తాము గాయపరుచుకునే ప్రవర్తన  చూపించవచ్చు. దీనివల్ల నోటి భాగాలు మరియు పళ్లు దెబ్బతినే అవకాశం ఉంటుంది

# పళ్లు కొరికే అలవాటు

పళ్లను గట్టిగా కొరికే అలవాటును బ్రక్సిజం అంటారు. ఇది పళ్లు మరియు దవడపై ప్రభావం చూపవచ్చు.

ఈ సమస్య సెరిబ్రల్ పాల్సీ లేదా తీవ్రమైన మేధో లోపం ఉన్న పిల్లల్లో కొన్నిసార్లు తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది.

ఒత్తిడి, కోపం, అలర్జీలు లేదా పంటి నొప్పి / చెవి నొప్పి కారణంగా పిల్లలు పళ్లు కొరకవచ్చు.

దీని వల్ల పళ్ల పై రక్షణ పొర (ఎనామెల్) దెబ్బతినడం, ఆహారం నమలడంలో ఇబ్బంది, పళ్లలో సున్నితత్వం పెరగడం వంటి సమస్యలు రావచ్చు.

పళ్లు కొరికే అలవాటు ఉన్నట్లు సందేహం కలిగితే , పిల్లలను పిల్లల దంత వైద్యుడు వద్ద పరీక్ష చేయించాలి.



# దంత వైద్యుల సలహా

**1. ముందస్తుగా అపాయింట్‌మెంట్ గురించి చర్చించండి**

ఇది సాధారణంగా డెంటల్ క్లినిక్ ఫ్రంట్ డెస్క్ ద్వారా జరుగుతుంది. క్లినిక్‌లో రద్దీ తక్కువగా ఉండే సమయాన్ని అపాయింట్‌మెంట్ కోసం ఎంచుకోవడం మంచిది.



**2. పిల్లలను ఇంట్లోనే ముందుగా అలవాటు చేయండి**

పిల్లలు ఇప్పటికే థెరపీ తీసుకుంటుంటే, నోటి కదలికలకు ఉపయోగించే ప్రత్యేక (ఓరో-మోటర్) పరికరాలు డెంటల్ పరీక్షకు అలవాటు పడటానికి సహాయపడతాయి. టూత్‌బ్రష్ లేదా నమలడానికి ఉపయోగించే ట్యూబ్స్ వంటి వాటితో అలవాటు చేయవచ్చు.

సెన్సరీ సమస్యలు ఉన్న పిల్లలకు సహాయం చేయడానికి మీ పిల్లల స్పీచ్ థెరపిస్ట్ లేదా ఆక్యుపేషనల్ థెరపిస్ట్ సూచనలు తీసుకోవడం ఉపయోగకరం.

**3.మొదటి అపాయింట్‌మెంట్‌కు లక్ష్యాలు నిర్ణయించుకోండి**

మొదటి విజిట్ లోనే పూర్తిగా చికిత్స చేయించడం ప్రధాన లక్ష్యంగా ఉండకూడదు. పిల్లలతో ఓర్పుగా ఉండి, దంత వైద్యులపై నమ్మకం ఉంచాలి. పిల్లలు దంత వైద్య బృందంతో సౌకర్యంగా ఉండేందుకు మరియు చిన్న చిన్న చికిత్సలను కూడా అంగీకరించే స్థాయికి రావడానికి కొన్నిసార్లు అనేక సందర్శనలు అవసరం కావచ్చు.

# ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తుల కోసం దంత చికిత్స ప్రణాళిక

మీ పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తి సమాచారం సేకరించి, దంత వైద్యుడు తగిన చికిత్స ప్రణాళికను రూపొందిస్తారు.

| |
|---|
| పిల్లల ఆరోగ్య చరిత్ర |
| ప్రధాన దంత సమస్య |
| ప్రస్తుతం ఉన్న సమస్య వివరాలు |
| వైద్య చరిత్ర |
| గత దంత చికిత్స వివరాలు |
| కుటుంబ మరియు సామాజిక పరిస్థితులు |
| వైద్య నివేదికలు (క్లినికల్ పరీక్షలు, ఎక్స్‌రేలు, ల్యాబ్ పరీక్షలు) |
| సమస్య నిర్ధారణ |
| చికిత్స ప్రణాళిక |



# మీ పిల్లల వైద్య సంబంధిత సవాళ్లను అర్థం చేసుకోవడం

మీ పిల్లలకు సరైన దంత సంరక్షణ అందించేందుకు, సరైన అంచనా మరియు చికిత్స ప్రణాళిక కోసం ఈ వివరాలను సిద్ధంగా ఉంచండి:

- పిల్లలకు ఏ విధమైన అభివృద్ధి లోపం ఉంది?
- ఆ సమస్య తీవ్రత ఎంతవరకు ఉంది?
- పిల్లల ఆరోగ్య పరిస్థితి తాత్కాలికంగా మరియు దీర్ఘకాలంలో ఎలా ఉండే అవకాశం ఉంది?
- ప్రస్తుతం ఎలాంటి చికిత్స జరుగుతోంది లేదా భవిష్యత్తులో ఏ చికిత్స ఇవ్వనున్నారు?
- పిల్లలు ప్రస్తుతం ఏ మందులు తీసుకుంటున్నారు?



# మీ పిల్లల ఆరోగ్య పరిస్థితి వల్ల సామాజిక జీవితంపై కలిగే ప్రభావాన్ని అర్థం చేసుకోవడం

మీ పిల్లలకు సరైన దంత సంరక్షణ అందించేందుకు, సరైన అంచనా మరియు చికిత్స ప్రణాళిక కోసం ఈ వివరాలను సిద్ధంగా ఉంచండి:



- పిల్లల అభివృద్ధి లోపం  వారి రోజువారీ జీవితంపై ఎలా ప్రభావం చూపుతోంది?
- దంత సమస్యలు పిల్లల జీవన విధానంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి?
- పిల్లలు విషయాలను అర్థం చేసుకోవడం మరియు మాట్లాడే సామర్థ్యం ఎలా ఉంది?
- ఇంట్లో పిల్లలకు లభిస్తున్న మద్దతు ఎలా ఉంది?
- పిల్లలు, వారికి సహాయం చేసే వ్యక్తులు దంత చికిత్స నుంచి ఏమి ఆశిస్తున్నారు?
- కుటుంబంలో ఆర్థిక వనరులు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి?

# మీ పిల్లల దంత సమస్యలను అర్థం చేసుకోవడం

మీ పిల్లలకు సరైన దంత సంరక్షణ అందించేందుకు, సరైన అంచనా మరియు చికిత్స ప్రణాళిక కోసం ఈ వివరాలను సిద్ధంగా ఉంచండి:

- పిల్లల వైకల్యం లేదా ఆరోగ్య సమస్యతో సంబంధం ఉన్న దంత సమస్యలు ఏమిటి?
- ఇంకా ఏ ఇతర దంత సమస్యలు ఉన్నాయి?
- పిల్లల ఆరోగ్య పరిస్థితి దంత చికిత్స అందించడంపై ఎలా ప్రభావం చూపుతోంది?
- పిల్లల వైకల్యం మరియు దానికి సంబంధించిన సమస్యలు నోటి పరిశుభ్రతను నిర్వహించడంలో ఎలా ప్రభావితం చేస్తున్నాయి?
- భవిష్యత్తులో పిల్లల దంత ఆరోగ్యం ఎలా ఉండే అవకాశం ఉంది?



# మీ పిల్లల శారీరక సవాళ్లను అర్థం చేసుకోవడం

శారీరక వైకల్యాలు ఉన్న పిల్లలకు డెంటల్ క్లినిక్ వాతావరణంలో సౌకర్యంగా ఉండేందుకు డెంటల్ చెయిర్ వంటి విషయాల్లో ప్రత్యేక సహాయం అవసరం కావచ్చు.



పిల్లలకు తమ నియంత్రణలో లేని శరీర కదలికలు లేదా స్పందనలు ఉంటే, వారికి సురక్షితంగా దంత చికిత్స అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి దంత వైద్య నిపుణులతో ముందుగానే మాట్లాడండి.

ప్రత్యేకంగా, పిల్లలు ఒకేచోట కదలకుండా కూర్చోలేని పరిస్థితిలో, దంత వైద్యులు ఉపయోగించే పరికరాలు సురక్షితంగా వాడేందుకు అదనపు జాగ్రత్తలు అవసరం అవుతాయి.

# నోటి లోపలి భాగాలను పరీక్షించేటప్పుడు దంత వైద్యులు ఏమేమి పరిశీలిస్తారు?

- నోటిలో ఉన్న పళ్ల సంఖ్య
- పళ్ల ఎదుగుదలలో లేదా నిర్మాణంలో లోపాలు
- పళ్లు అరిగిపోవడం – రాపిడి వల్ల పళ్లు అరిగిపోయాయా?
- ఆమ్లాల వల్ల పళ్లు అరిగిపోవడం: కడుపులోని ఆమ్లం నోటిలోకి తిరిగి రావడం వల్ల పళ్లపై ఉండే రక్షణ పొర అరిగిపోయిందా?
- దెబ్బలు తగలడం వల్ల పళ్లకు కలిగిన గాయాలు
- పళ్ల అమరిక మరియు నమిలేటప్పుడు పళ్లు ఒకదానికొకటి ఎలా కలుస్తున్నాయి అనే విషయం
- నోటి పైభాగ నిర్మాణ (అంగిలి) పరిశీలన
- పుట్టుకతో ఉన్న మృదుకణజాల సమస్యలు
- పెదవులు మరియు నోటి మూల భాగాల స్థితి
- చెంపల లోపలి భాగాల ఆరోగ్యం
- చిగుళ్ల ఆరోగ్య పరిస్థితి



# నోటి లోపలి భాగాలను పరీక్షించేటప్పుడు దంత వైద్యులు ఏమేమి పరిశీలిస్తారు?

- నాలుక మరియు నోటి అడుగు భాగం
- నోటి పైభాగంలో వెనుకవైపు ఉండే మెత్తని భాగం.
- **అడినాయిడ్స్**: ముక్కు వెనుక భాగంలో ఉండే లింఫాయిడ్ కణజాలం మరియు **టాన్సిల్స్**: గొంతు వెనుక భాగంలో ఉండే కణజాల భాగాలు.
- లింఫ్ గ్రంథులలో వాపు ఉందా అని పరిశీలించడం
- పిల్లలు తమను తాము గాయపరుచుకునే అలవాట్లు, కొరుక్కున్న గుర్తులు లేదా కారణం తెలియని గాయాలు ఉన్నాయా అనే పరిశీలన. ఉదాహరణకు: గోళ్లతో చిగుళ్లను గాయపరుచుకోవడం
- నోటి ద్వారా శ్వాస తీసుకునే అలవాటు
- నాలుకను ముందుకు తోసే అలవాటు - నాలుక అనియంత్రితంగా బయటకు రావడం
- అధికంగా లాలాజలం(చొంగ) కారడం



# దంత చికిత్స ప్రణాళిక

దంత వైద్యులతో జరిగిన ప్రారంభ చర్చ ఆధారంగా, మీ పిల్లల ప్రధాన దంత సమస్యలను పరిశీలించి తగిన చికిత్స ప్రణాళికను రూపొందిస్తారు. అలాగే చికిత్సకు అవసరమైన ప్రాధాన్యతలను నిర్ణయిస్తారు.

**1. అత్యవసర చికిత్స**

**2. ప్రారంభ చికిత్స**



**4. భవిష్యత్తు దంత సంరక్షణ**

**3. నివారణాత్మక/ముందస్తు చికిత్స**

# అత్యవసర దంత చికిత్స ప్రణాళిక

- నొప్పి మరియు తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉన్న ప్రాంతాలకు వెంటనే చికిత్స అందించడం ముఖ్యమైన లక్ష్యం.
- ప్రతి విజిట్ లో పిల్లల అవసరాలను బట్టి చికిత్స లక్ష్యాలను మళ్లీ పరిశీలించాలి. అవి పిల్లలకు అనుకూలంగా, ఆచరణ సాధ్యంగా మరియు వాస్తవ పరిస్థితులకు సరిపోయేలా ఉండాలి. పళ్ల రూపం మాత్రమే ప్రధాన లక్ష్యం కాకూడదు. నొప్పి లేకుండా ఆహారం నమలగలగడం మరియు నోటి ఆరోగ్యాన్ని నిర్వహించగలగడం చికిత్స ప్రణాళికలో ముఖ్యమైన అంశాలు.



# ప్రారంభ చికిత్స

- దంత పరీక్షలో గుర్తించిన శస్త్రచికిత్స మరియు పళ్ల పునరుద్ధరణకు సంబంధించిన చికిత్సలు అవసరాన్ని బట్టి ప్రణాళిక చేయబడతాయి.
- చికిత్సలను దశలవారీగా నిర్వహిస్తారు. మొదట పిల్లల ప్రధాన సమస్య కు చికిత్స అందించి, తరువాత అనేక విజిట్ల ద్వారా పూర్తి నోటి ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెడతారు.
- చికిత్సను క్లినిక్‌లో చేయాలా లేదా ఆసుపత్రిలో చేయాలా, అలాగే  స్థానిక మత్తుమందు (లోకల్ అనస్తీషియా) ఉపయోగించాలా లేదా సాధారణ మత్తు (జనరల్ అనస్తీషియా) అవసరమా అనే విషయాలను వివరిస్తారు. కొన్ని సందర్భాల్లో క్లినిక్‌లో చికిత్స చేయడం సాధ్యం కాకపోతే, సాధారణ మత్తుమందుతో చికిత్స చేయడం ఉత్తమంగా ఉండవచ్చు.



# నివారణాత్మక/ముందస్తు చికిత్స

- పిల్లల్లో దంత సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే పద్ధతులను పాటించాలి.
- నోటి పరిశుభ్రతను నిర్వహించే సరైన విధానాలపై ప్రత్యేక సూచనలు ఇవ్వడం.

(క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించడం వల్ల పిల్లలు దంత వైద్యులతో సౌకర్యంగా ఉండటం అలవాటు అవుతుంది).

- ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్ష మరియు దంతాలను శుభ్రపరచే ప్రక్రియ (ఓరల్ ప్రొఫిలాక్సిస్) చేయించుకోవడం మంచిది.
- నోటి పరిశుభ్రతకు ఉపయోగపడే ప్రత్యేక ఉపకరణాలు మరియు ఫ్లోరైడ్ ఫోమ్ / వార్నిష్ వినియోగంపై దంత వైద్యుల సలహా తీసుకోండి.
- ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం రూపొందించిన నోటి పరిశుభ్రత సాధనాలు, ఉదాహరణకు మూడు బ్రష్ హెడ్లు కలిగి ఉండే బ్రష్ (త్రి హెడెడ్ టూత్ బ్రష్) వంటి వాటి వినియోగంపై సూచనలు తీసుకోవాలి. అవసరమైతే, బ్రష్ చేసే సమయంలో లాలాజలాన్ని పీల్చి తొలగించే మోటరైజ్డ్ సక్షన్ పరికరం ఉపయోగించడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.



# భవిష్యత్తు దంత సంరక్షణ

ప్రారంభ చికిత్సలను నిర్ణయించే ముందు, పిల్లల కోసం దీర్ఘకాల దంత సంరక్షణ ప్రణాళికను పరిగణలోకి తీసుకోవడం చాలా ముఖ్యము.

చికిత్స ప్రణాళిక ఆచరణ సాధ్యంగా మరియు పిల్లల అవసరాలకు అనుగుణంగా ఉండాలి.

దీర్ఘకాలం పాటు సులభంగా కొనసాగించగల నోటి పరిశుభ్రత పద్ధతులను ఎంపిక చేయాలి.

కదలికల (మొబిలిటీ ) సమస్యలు లేదా తీవ్రమైన సెన్సరీ సమస్యలు ఉన్న పిల్లల్లో పదే పదే ఆసుపత్రి/ క్లినిక్ లకు తీసుకువెళ్లడం తగ్గించడం మంచిది.

కొన్ని సందర్భాల్లో సాధారణ మత్తుమందుతో చికిత్స చేయడం అనుకూలమైన మార్గంగా ఉండవచ్చు.



# దంత వైద్యుల వద్దకు వెళ్లేందుకు మీ పిల్లలను ఎలా సిద్ధం చేయాలి?

- దంత వైద్యుల వద్దకు వెళ్లే ముందు, అక్కడ ఏమి జరుగుతుందో పిల్లలకు సరళమైన ఉదాహరణలతో ముందుగానే వివరించడం చాలా ఉపయోగకరం.

- సోషల్ స్టోరీ  ద్వారా డెంటల్ విజిట్ గురించి పిల్లలకు చెప్పండి. ఇలా చేయడం వల్ల చికిత్స సమయంలో జరిగే దశలకు పిల్లలు మానసికంగా సిద్ధమవుతారు.

- పిల్లలకు అనుకూలంగా, భయంగా అనిపించని డెంటల్ సెంటర్‌ను ఎంపిక చేయండి.

- పిల్లలు నిద్రపోయే సమయంలో దంత వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లకుండా ఉండాలి.

# దంత వైద్యుల వద్దకు వెళ్లేందుకు మీ పిల్లలను ఎలా సిద్ధం చేయాలి?

- పిల్లలను బలవంతంగా సహకరించమని ఒత్తిడి చేయకండి.
- పిల్లలతో ధైర్యంగా మరియు ప్రోత్సాహకరంగా మాట్లాడండి. ఇంజెక్షన్ పేరుతో భయపెట్టకండి.
- మొదటి సందర్శనలోనే దంత వైద్య బృందం పూర్తిగా నోటి పరీక్ష చేయలేకపోవచ్చు. కాబట్టి ముందుగా పిల్లల్లో నమ్మకం మరియు సౌకర్యం పెంపొందించే దిశగా ప్రయత్నించాలి.
- పిల్లలను ప్రోత్సహించడానికి మాటల ద్వారా ప్రశంసించండి. సహకరించేందుకు నచ్చిన ఆహారాన్ని బహుమతిగా ఇస్తామని ఆశపెట్టకండి.

# దంత వైద్యుల వద్దకు వెళ్లేందుకు మీ పిల్లలను ఎలా సిద్ధం చేయాలి?

మాటలు, శబ్దాలు, చర్యలు మరియు సంకేతాలను మెల్లగా పునరావృతం చేస్తే "చూపిస్తూ చెప్పే పద్ధతి" పిల్లలకు ఎక్కువగా సహాయపడుతుంది. అలాగే డెంటల్ పరికరాలు మరియు చికిత్సను పిల్లలకు భయపడకుండా అర్థమయ్యేలా సరళమైన పదాలతో వివరించడం మంచిది.
ఉదాహరణకు: డ్రిల్ ఉపయోగించే సమయంలో “నీ పళ్లకు షవర్ చేస్తున్నాం” అని, స్థానిక మత్తుమందు (లోకల్ ఎనస్తీషియా)ఇచ్చేటప్పుడు “నీ పన్నును నిద్రపుచ్చుతున్నాం” అని చెప్పవచ్చు.

పిల్లల్లో నమ్మకం పెంచేందుకు, డెంటల్ పరికరాలను ముందుగా చేతితో తాకి చూడడానికి అవకాశం ఇవ్వండి.

క్లినిక్‌లో రద్దీ తక్కువగా ఉండే ఉదయం సమయాల్లో అపాయింట్‌మెంట్ పెట్టడం మంచిది. ఆ సమయంలో పిల్లలు హుషారుగా మరియు ప్రశాంతంగా ఉంటారు. చికిత్సను కేవలం తల్లిదండ్రుల సౌకర్యానికి అనుగుణంగా చేయాలని ఒత్తిడి చేయకండి. పిల్లల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

మీ పిల్లలకు ఉత్తమమైన సంరక్షణ అందించేందుకు దంత వైద్య బృందంపై నమ్మకం ఉంచి, వారితో సహకరించండి.

Nayi Disha
inform · connect · empower

## నయీ దిశా రిసోర్స్ సెంటర్

ఇది లాభాపేక్షలేని సంస్థ. మేధో మరియు అభివృద్ధి సంబంధిత వైకల్యాలు ఉన్న వ్యక్తుల కుటుంబాలకు సాంకేతికత ద్వారా సాధికారత కల్పించడం మా లక్ష్యం..

**గమనిక:**

ఇక్కడ పొందుపరచిన సమాచారం వైద్య సలహాగా పరిగణించరాదు. ఇది కేవలం అవగాహన మరియు సమాచార ప్రయోజనాల కోసం మాత్రమే అందించబడింది.



ఈ సమాచారానికి సంబంధించిన విషయాలు మరియు నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందించిన పిల్లల దంత వైద్య నిపుణులు:

Dr. గాయత్రి మోఘే
Dr. కెవిన్ వర్గీస్ సామ్

టూత్ బడ్డీస్
ఫిల్మ్‌నగర్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్.




©Copyright2019